క్లుప్తంగా

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం



జి - 20 సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం పలికారు.

1 నుంచి ఉచిత శిక్షణ తరగతులు



ఉచిత శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల చేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

తగరపువలస/ ఆనందపురం : ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటి నుంచి ఆనందపురం – బంటుపల్లి వారి కళ్లాల రోడ్డులోని గాయత్రి డిగ్రీ కళాశాలలో కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 30లోగా 99081 16816, 93811 54587లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉచిత శిక్షణకు సంబంధించిన కరపత్రాలను తగరపువలసలో మంగళవారం ఏబీవీపీ ప్రతినిధులు విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ లొడగల అచ్చిబాబు, 1, 2 వార్డుల బీజేపీ కన్వీనర్ శీరపు రామలక్ష్మి, పరిషత్ ప్రతినిధులు జి.రాజు, టి.శంకర్, బి.రామకృష్ణ, బి.వంశీ, ఎల్.జగన్, ఐనాడ మాధవ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.10 వేల సాయం



ఎల్లారమ్మ ఆలయంలో బోగి రమణ, తదితరులు

తగరపువలస: స్థానిక ఎల్లారమ్మ ఆలయంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి వ్యాపారవేత్త బోగి రమణ మంగళవారం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. తగరపువలస, భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీల గ్రామదేవత ఎల్లారమ్మ ఆలయంలో ప్రతి మంగళవారం అన్నదానం నిర్వహిస్తారు. మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి తగరపువలసకు చెందిన మాధవరపు మాల్యాద్రి, వెంగమ్మ దంపతులు సాయం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రాజగిరి కృష్ణ, పూసర్ల రామారావు, శంకర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

భీమునిపట్నం: భీమిలి నేరెళ్లవలస కాలనీకి చెందిన మైనర్ వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ప్రాంతంలో నివసిస్తున్న జోగ రమేష్ అనే యువకుడికి పీతల దేవి (16) అనే బాలికతో 8 నెలల క్రితం వివాహం జరిగింది. రమేష్ బైక్ మెకానిక్ షాపులో పని చేస్తున్నాడు. పెళ్లి సమయంలో రూ.5 లక్షల కట్నంతోపాటు ఇతర లాంచనాలు అందించారు. అయినప్పటికీ కొద్ది రోజులుగా అదనపు కట్నం కోసం దేవిని రమేష్ వేధించడంతోపాటు అనుమానించేవాడు. ఈ క్రమంలో తరచూ వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు దేవి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విజయనగరంలో నివసిస్తున్న మృతురాలి తల్లి పీతల యర్రమ్మయ్మ విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తె మృతికి అల్లుడు రమేష్ కారణమని ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు దేవి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడ: కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, డిమాండ్స్ నెరవేర్చాలని వచ్చే నెల 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మధురవాడ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.కొండమ్మ, పి.రాజ్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జీవీఎంసీ జోనల్ ఆఫీసు ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలతోపాటు గిరిజన హక్కులు, వనరుల రక్షణ, ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణ కోసం చలో ఢిల్లీ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డి.అప్పలరాజు, వి.సంధ్య, జి.చిన్నారావు, విప్లవకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా

- సీఎం జగన్ చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యుల క్షీరాభిషేకం
- రూ.1.95 కోట్ల చెక్కు అందించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మహిళలు



స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ తదితర సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న లబ్ధితో తమ జీవితాలకు ఆర్థిక భరోసా లభించిందని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. చిట్టివలస బంతాట మైదానంలో ఒకటో వార్డుకు చెందిన 285 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,668 మంది మహిళలకు రూ.1.95 కోట్ల వైఎస్సార్ ఆసరా లబ్ధిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెక్కు ద్వారా మంగళవారం అందించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు వివక్షకు తావులేకుండా 23 రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్పొరేషన్ల పదవులు కేటాయించామన్నారు. పేద ప్రజల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికలు పేదవారికి, పెత్తందార్లకు మధ్య జరిగే పోరాటంగా భావించాలన్నారు. పేద, మధ్య తరగతి, బడుగుబలహీన వర్గాల ప్రజలంతా ముఖ్యమంత్రి జగన్ పక్షాన నిలిచి సంక్షేమ పథకాల కొనసాగింపునకు చేయూత అందించాలని కోరారు. ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మ మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలన అంతా మోసాలు, కుట్రలతో కూడుకున్నదేనన్నారు. సంక్షేమ పథకాల పేరుతో పలుమార్లు మహిళలను బాబు మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు మోసాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, జెడ్పీ బొడ్డేపల్లి రాము, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, జీరు వెంకటరెడ్డి, ఉప్పాడ నాగేశ్వరారవు, జీరు సుజాత, జీవీ రమణ, భాగం సుధాకర్, చిల్ల ప్రమీల, తమ్మిన నరసింగరావు, పందిరి విజయ్, కొప్పల రమేష్, చిప్పాడ వెంకటేష్, వెంపాడ వెంకట రమణ, అల్లు బాబూరావు, రొక్కం శ్రీను, నీలాపు రామిరెడ్డి, గిడుతూరి మురళి, సర్పంచ్ జీవీ నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సకాలంలో వైద్య సేవలు



జెండా ఊపి 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి నియోజకవర్గానికి అదనంగా కేటాయించిన 104 వైద్య వాహనాన్ని మంగళవారం చిట్టివలసలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక 104 వాహనం కేటాయించిందన్నారు వీటిలో ఏదైనా వాహనం సకాలంలో అందుబాటులోకి రాకపోతే ఈ అదనపు వాహనాన్ని పంపిస్తారన్నారు. పేద ప్రజల పాలిట పెన్నిధి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆలోచనల నుంచి వచ్చిన 108, 104 వాహనాల ద్వారా ఇంకా మెరుగైన సేవలు అందించడానికి ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీష్, డీపీఎంవో డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ బద్రీనారాయణ, 104 వాహనాల కో ఆర్డినేటర్ సంతోష్, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, తగరపువలస పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

క్షయ నియంత్రణకు ఐసీఎంఆర్ ప్రాజెక్టు

కొమ్మాది: రానున్న రెండు సంవత్సరాల్లో క్షయ వ్యాధిని పూర్తిగా నియంత్రించే లక్ష్యంతో పనిచేస్తున్న ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఇటీవల గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌కు ప్రాజెక్టును మంజూరు చేసింది. ఈ విషయాన్ని ప్రొఫెసర్ సి.రాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు.

కృత్రిమ మేధతో జీవన ప్రమాణాల పెంపు

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణ, విద్యుత్, తాగునీటి వినియోగం, సహజసిద్ధమైన గాలి, వెలుతురు లభించే భవన నిర్మాణాలు ఆకర్షణీయ నగరాల్లో అవసరమని, దీనికి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ఉపయోగపడుతుందని బ్రెజిల్ శాస్త్రవేత్త ఎస్.ఎల్.విజయ్ కుమార్ పేర్కొన్నారు. తద్వారా మానవ జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. గీతం వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో మంగళవారం ఆయన ప్రసంగించారు. ఉపాధి కోసం పట్టణాలకు వచ్చే ప్రజల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతోందన్నారు. 2100 సంవత్సరం నాటికి ప్రపంచంలో 80 శాతం ప్రజలు పట్టణాల్లో ఉంటారని పేర్కొన్నారు. అనంతరం విజయ్‌కుమార్‌ను గీతం ప్రతినిధులు సత్కరించారు.

ఆస్తుల లీజుకు వేలం వాయిదా

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ - 2లో డైలీ మార్కెట్, వారపు సంత, ముడసర్లోవ పార్కు ప్రవేశ రుసుము, పార్కింగ్, క్యాంటీన్, ఐస్ క్రీమ్ బల్ల నిర్వహణ లీజు కోసం నిర్వహించాల్సిన వేలం పాట మరోసారి వాయిదా పడింది. కేవలం మార్కెట్ వేలం పాటకి ఒకే ఒక్కరు హాజరు కావడంతో బుధవారానికి వాయిదా వేసినట్టు సూపరింటెండెంట్ అప్పలరాజు చెప్పారు. ఆసక్తి కలిగిన పాటదారులు మధురవాడ జోనల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటల నుంచి నిర్వహించే పాటలో పాల్గొనాలని కోరారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిశీలన

తగరపువలస: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం తగరపువలస, భీమిలిలోని ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమీక్ష జరిపారు. ఈహెచ్ఆర్, ఇ - సంజీవని తనిఖీ చేసి ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే, ఏఎన్‌సీలను గుర్తించి టీటీ అందించాలని సూచించారు. హై రిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యుల సలహా మేరకు ఐరన్, పోలిక్ మాత్రలు, పౌష్టికాహారం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. సమయపాలన, ఎఫ్ఆర్ఎస్ హాజరు ముఖ్యమన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి, శస్త్రచికిత్సలు తగ్గించేలా ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది డ్రెస్‌కోడ్ పాటించాలని ఆదేశించారు. ఆయనతోపాటు డీపీఎంవో డాక్టర్ ఎస్.రమారెడ్డి, డీపీవో నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐ భరత్ కుమార్ రాజుకు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, శంకరరావు

పద్మనాభం: మండలంలోని నేరెళ్లవలస గ్రామానికి చెందిన సారిక ప్రకాశరావు నుంచి తమకు ప్రాణహాని ఉందని జెడ్పీటీసీ సభ్యుడు, రెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుంకర గిరిబాబు, నేరెళ్లవలసకు చెందిన సారిక శంకరరావు ఎస్ఐ భరత్ కుమార్ రాజుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 27న తాను గ్యాస్ ఏజెన్సీ ప్రారంభోత్సవంలో ఉండగా సారిక ప్రకాశరావు మద్యం సేవించి అక్కడకు వచ్చాడని... తనను, సారిక శంకరరావును కులం పేరుతో దూషించి, కత్తి పట్టుకుని మండల ఆఫీసు పరిసరాల్లో చంపుతానంటూ తిరిగాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల సమయంలో 20 మందిని వెంటబెట్టుకుని తమను నరకుతానంటూ మైకులో సారిక ప్రకాశరావు దుర్భాషలాడాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్కర్లకు సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

తగరపువలస: రాష్ట్రంలో ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్కర్లకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర ప్రైవేట్ వర్కర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.సత్యనారాయణ అన్నారు. తగరపువలసలో భీమిలి డివిజన్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్కర్లు అందరూ సమిష్టిగా పనిచేసి హక్కులు సాధించుకోవాలని సూచించారు. ఇందుకోసం త్వరలో డివిజన్ వర్కర్ల కోసం కార్యాచరణ తయారు చేస్తామన్నారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మండవ కుటుంబరావు, ఉపాధ్యక్షుడు కె.పాల్‌రాజు, ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరిరావు, కార్యదర్శి బి.మాధన్న, కోశాధికారి ఎం.శ్రీధర్, రవిబాబు, స్థానిక ప్రతినిధి పాశల శివ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు



భక్తులకు పులిహోర అందిస్తున్న సేవా సంఘం సభ్యులు

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ దర్శనానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఈ నెల 20 నుంచి 23 వరకు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మారువారం సందర్భంగా దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఇక్కడి నూకాలమ్మ వారి సేవా సంఘం ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి కీర్తి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు, శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.బాలామణి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, శ్రీనివాసరావు, అక్కులు పాల్గొన్నారు.

నిర్మాణ్ ఉత్సవ్‌లో నమూనాల ప్రదర్శన

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న నిర్మాణ్ ఉత్సవ్ యువ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు వేదికయ్యింది. సివిల్ ఇంజినీరింగ్ నిపుణుల ప్రతిభకు అద్దం పట్టే భారీ వంతెనను, ఫ్లై ఓవర్‌లో సరికొత్త భవన నిర్మాణ సామాగ్రి, నదులు, సముద్రాలపై హైడ్రాలిక్ వంతెన నిర్మాణం వంటి నమూనాలను విద్యార్థులు మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు డీన్ ప్రొఫెసర్ సి.విజయ్ శేఖర్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డి.ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలలలోని విలాస్కాన్‌పాలెంలో పెద్ద కాలువలో పూడిక తీత పనులను ఎంపీపీ కంటుబోతు రాంబాబు మంగళవారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో ఈ పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. మూడు కిలో మీటర్ల నిడివి గల కాలువలో పూడిక తీస్తున్నారు. దీనివల్ల మూడు వందల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లి సన్యాసప్పడు, వైఎస్సార్ సీపీ నాయకుడు బోని సన్యాసినాయుడు, రైతులు పాల్గొన్నారు.